సాక్షి 24|7
తూర్పుగోదావరి
సోమవారం 23-4-2018

## ఎంసెట్ కోలాహలం

ఎంసెట్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కాకినాడ అచ్యుతాపురం గేటు వద్ద ఉన్న పరీక్ష కేంద్రం ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులతో కిక్కిరిసిన రోడ్డును చిత్రంలో చూడవచ్చు. - 7లో



## కన్నవారికీ పరీక్షే..



కాకినాడలో అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద చెట్ల నీడలోనే సేదతీరుతున్న తల్లిదండ్రులు, సహాయకులు



ఎంసెట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని చెబుతున్న అధికారులు.. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిలువ నీడలేక, తాగేందుకు నీళ్లు లేక ఇలా నానాయాతన అనుభవించారు.

ఫొటోలు: - సతీష్‌కుమార్ పేపకాయల, సాక్షి, కాకినాడ



ఎండదెబ్బకు ఇలా..



అపార్ట్‌మెంట్ కింద సేదతీరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, సహాయకులు



ఎంసెట్ కేంద్రం ఎండదెబ్బకు నెత్తిన కరపత్రాలు అడ్డుపెట్టుకున్న దృశ్యం

# ప్రారంభమైన ఏపీ ఎంసెట్ ఆన్‌లైన్ పరీక్షలు

- హాజరైన 5383 మంది విద్యార్థులు
- గైర్హాజరైనవారు 305

బాలాజీచెరువు (కాకినాడసిటీ):

కాకినాడ జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించే ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్ మెడిసిన్ కామన్ ఎంట్రన్స్ –2018 ఆన్‌లైన్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం రీజియన్ల వారీగా పరీక్షలు నిర్వహించారు. కాకినాడ రీజియన్‌లో సూరంపాలెం ప్రగతి, ఆదిత్య ఇంజినీరింగ్, కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న టీసీఎస్‌కు చెందిన అయాన్ ఇనిస్టిట్యూట్, కైట్ కోరంగి కళాశాల, అమలాపురం రీజియన్‌లో శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల, రాజమండ్రి రీజియన్ పరిధిలో గైట్ కళాశాలతో పాటు అయాన్ ఇనిస్టిట్యూట్‌లలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం పదిగంటల నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ సారి నిమిషం ఆలస్యమైతే ప్రవేశం లేదనే నిబంధనను సడలింపు ఇచ్చినా విద్యార్థులందరూ పరీక్ష కేంద్రానికి సకాలంలోనే హాజరయ్యారు. కాకినాడలో టీసీఎస్ సంస్థకు చెందిన అయాన్ ఇన్‌స్టిట్యూట్ చాలా మందికి తెలియక జేఎన్‌టీయూకే హెల్ప్‌లైన్ కేంద్రానికి చేరుకుని సమాచారం తెలుసుకున్నారు. జేఎన్‌టీయూకేలోని ఎంసెట్ ప్రధాన కార్యాలయంలో కన్వీనర్ సాయిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కాకినాడలో ఓ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



రాజమహేంద్రవరంలో విద్యార్థుల హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

**పాస్‌వర్డ్ విడుదల చేసిన మంత్రి గంటా..**

రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఉదయం 8.30 గంటలకు ఎంసెట్ –18ఆన్‌లైన్ పరీక్ష పాస్‌వర్డ్ విడుదల చేశారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ పండుల రవీంద్రబాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఎంసెట్ కన్వీనర్ సీహెచ్ సాయిబాబు, ఇన్‌చార్జ్ వీసీ రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ ప్రసాద్ రాజు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలోని ఓ పరీక్ష కేంద్రానికి పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

**తొలిరోజు పరీక్షకు హాజరైన విద్యార్థుల శాతం..**

| కేంద్రం | హాజరు కావలసిన వారు | హాజరైన వారు | హాజరు శాతం |
|---|---|---|---|
| కాకినాడ | 2613 | 2433 | 93.01 |
| అమలాపురం | 519 | 497 | 95.08 |
| రాజమండ్రి | 2556 | 2453 | 96.0 |